# నీలము

- జ్యోతిష్యరత్న డా॥వేణుగోపాల్ రావు వీరమనేని

నీలము - నీలము వర్ణముతో కూడి స్వచ్ఛమైన పారదర్శకమైన హెక్సాగోనల్ బై పిరమిడల్ నిర్మాణంతో గూడి పంచమహారత్నాలలో (నవరత్నాలలో) ఒకటైన రత్నం. నీలమునకు సంబంధించిన గ్రహము శని. జ్యోతిష్యశాస్త్రంలో శనికి ప్రత్యేకస్థానం ఉన్నందున ఈ గ్రహం గురించి కొన్ని వివరాలు తెలుసుకుందాం.

శని పురాణం ప్రకారం సూర్యుడు ఛాయాదేవిల సంతానంగా చెబుతారు. ఒక సారి సూర్యుని మిగతా సంతానానికి శనిపై కోపం వచ్చి గొడవకు దిగడం. ఆ గొడవలో శనిని కొట్టడం, వని కాళ్లకు దెబ్బతగలడం జరుగుతుంది. దానితో శని శాశ్వతంగ కుంటుతూ, నిధానంగా శ్రమపడుతూ నడుస్తూ ఉంటాడు. అందుకని "మంద" లేక "మందగమనుడు" అని అంటారు.

జ్యోతిష్య ప్రకారం కూడా శని 12 రాశులు చుట్టిరావడానికి 30 సంవత్సరాలు పడుతుంది. "శున్" నుంచి "శని" అనే అర్థం వచ్చింది. దాపర్థం శూర్యమని, మరిచి పోవడం, మందమతి, ఆలోచనాశక్తి తగ్గడం. శనిని పాముగా భావిస్తే తలను రాహుగా తోకబాగాన్ని కేతువుగా భావిస్తారు.

శని జాతకరీత్యా 2.3 మరియు 7 నుంచి 10వ స్థానాలలో ఉన్నట్లయితే మంచి ఫలితాలనివ్వవచ్చు. కాని లగ్నంనందు. 4,5 మరియు 6వ స్థానంలో ఉన్నట్లయితే చెడు ఫలితాలనిస్తుంది.

శనికి రవి, చంద్ర మరియు కుజులు శత్రువులు, శుక్ర, బుధ మరియు రాహువులు మిత్రులు, గురుడు మరియు కేతువులు తటస్థం. శని, రవితోగాని గురునితో కలిసి ఒకే స్థానంలో ఉన్న మంచిది. తులలో ఉన్న ఉచ్ఛ, మేషం నీచస్థానం, కర్కాటక, సింహ మరియు వృశ్చికంలు శత్రుస్థానములు. శని, తుల, కుంభ మరియు మకరంలో ఉన్నప్పుడు, 7వ స్థానంలో ఉన్నప్పుడు, స్వదశ యందు, శనివారం రోజున శని బలవంతుడుగా ఉంటాడు.

గోచారరీత్యా శని చంద్రరాశి నుండి ఒక్కొక్క రాశిలో రెండున్నర సంవత్సరాలు ఉంటుంది. అది ఒక్కొక్క స్థానంలో ఉన్నప్పుడు గోచారఫలితాలు వేరువేరుగా ఉంటాయి. అవి 1వ స్థానం - రోగపీడ, 2-సంతాననష్టం, 3-శుభం, 4-కళాత్రనష్టం, 5-ధనవ్యయం, 6-శుభం, 7-భార్యకు అనారోగ్యం, 8-పుత్ర నష్టం, 9-దారిద్ర్యం, 10-పాపకృత్యం, 11-శుభం మరియు 12వ స్థానం శత్రుభయం, శ్రమ, అలసట.

గోచరరీత్యా శని సంచారం ఉన్న రాశి నుండి 5,9, మరియు 12 స్థానాలలో గరుడున్న మంచిదిగాదు.

శనికి 3,6 మరియు 11 స్థానములలో గ్రహాలున్న నీచస్త్రీలతో పరిచయం, బలహీనత, అనారోగ్యం, కలహములు, స్థానచలనములను కలిగించును.

జాతకరీత్యా శని 1వ స్థానంలో ఉన్న చంచలస్వభావం, 2-కుటుంబానికి మేలు చేయును, 3-జీవితమంతయు పరిక్షమాదిరిగా ఉంటుంది, 4-తల్లికి మంచి గాకపోవచ్చు. 5-పుత్రదోషాన్ని సూచించవచ్చు, 6-అప్పులు, కీళ్లనొప్పులు, 7-వివాహం కొంచెం ఆలస్యం కావచ్చు. 8-దీర్ఘాయువును ప్రసాదిస్తాడు, 9-కొంచెం పేదరికం అనుభవింపవచ్చు, 10- కొద్ది మేలు చేయవచ్చు, 11-విజయం, రాజకీయ ప్రాముఖ్యం, 12-కొంచెం శారీరక అనారోగ్యం.

శని మేషలో ఉన్నట్లయితే అదృష్ట లోపం, వృషభం - విజయం కలుగును, మిధునం- కష్టతరమైన కుటుంబజీవితం, కర్కాటకం-పేదరికం అనుభవింపవచ్చును, సింహం-మధ్యస్థ జీవితం అనుకోకుండ విపరీత మార్పులకు లోనగును, కన్య-మంచి విజయం సాధిస్తారు. తుల-అదృష్టం, మంచి గౌరవం, వృశ్చికం-దృఢమనోభారం, ధనస్సు-నిజాయితి, మకరం-మంచివిద్య, మంచి సంసారం, కుంభం-వేదాంతిగావచ్చు మరియు మీనంలో ఉన్నట్లయితే వివేకవంతులు, ధనవంతులు గావచ్చు. శని పాపిగా ఉండె లగ్నజాతకులు మేష, కర్కాటకము, సింహం, వృశ్చికం, ధనుర్, మీన లగ్నాలు, శుభులుగా ఉండే లగ్నజాతకులు వృషభం, తుల మరియు కుంభ లగ్నంలు.

ముఖ్యంగా శనిని గురించి ఏల్నాటి శనిగా చాలామందికి తెలుసు. ఏల్నాటి శని (సాడేసాత్) అనగా గోచారరీత్యా భూమిపై ప్రజలపై శని 7 సంవత్సరాల 6 నెలలు ప్రభావం చూపడం.

ముందుగా వివరించినట్లు ప్రతి రాశిలో రెండున్నర సంవత్సరాలు సంచారం చేయును.

అందులో చంద్రరాశికి 1వ స్థానం, 2వ స్థానం మరియు 12 వ స్థానంలో రెండున్నర సంవత్సరాలు చొప్పున ఏడున్నర సంవత్సరాలు సంచరించునప్పుడు చెడు ప్రభావం చూపును. జన్మరాశిలో (1వ స్థానం) ఉన్నప్పుడు అకారణకలహాలు, ఆస్తినష్టం, అనారోగ్యం, రెండవ స్థానంలో ఉన్నప్పుడు దు:ఖం, ఆశనిరాశలు, నిస్పృహ, అపవాదులు, 12వ స్థానంలో ఉన్నప్పుడు పూర్తిగ ధనహాని, ఇంట్లో కీచులాటలు.

మానవ జీవితంలో ఏల్నాటి శని రెండు నుంచి మూడు పర్యాయాలు అనుభవంలోకి రావచ్చు (90 సంవత్సరాలు బ్రతికి ఉన్నట్లయితే ఎలాగంటే శనికి ఒక భ్రమణానికి 30 సంవత్సరాలు పడుతుంది కాబట్టి), మొదటి అయిదు సంవత్సరాలు (12.1 మొదటి స్థానాలలో ఉన్నప్పుడు) ఇబ్బందులు అధికం. విపత్తులధికం, చివరి రెండున్నర సంవత్సరాలు ధననష్టం, విచారం మొదటి రెండున్నర సంవత్సరాలు "శిరస్సు శని" అని, మధ్య రెండున్నర సంవత్సరాలను "జన్మశని" అని చివరి రెండున్నర సంవత్సరాలను "పాదశని" అంటారు. ఈ ఏల్నాటి శని బాల్యంలో వస్తే "మంగుశని" అని. యవ్వనంలో వస్తే "పొంగుశని" అని మరియు వృద్ధాప్యంలో వచ్చినట్లయితే "మారకశని" అని అంటారు. ఏల్నాటిశనియేగాక చంద్ర రాశి నుండి 8వ స్థానంలో చంద్రుడుంటే "అష్టమశని" అని. 4వ స్థానంలో ఉన్నట్లయితే "అర్థాష్టమ శని" అని అంటారు. మరియు 7వ స్థానంలో ఉన్నచో "కందశని" అని అందురు. గోచారరీత్యా శని 3,6,10 మరియు 11 స్థానాలలో ఉన్నట్లయితే మంచిదని చెబుతారు.

శని గ్రహం ప్రభావము చూపే అంశాలు : ఆయుష్షు, జీవనోపాయం, మరణం, సేవకులు, బందికాన, ప్రవాసం, నీచవిద్య, దు:ఖం, అధర్మం, అనాచారము, కార్యభంగము, రాక్షసత్వము, వ్యసనము మొదలయినవి శని ప్రభావం వలన లేదా చెడు స్థానంలో ఉన్నప్పుడు అతిత్రాగుడు, కీళ్లనొప్పులు, కామెర్లు, ధననష్టం, కుడిచెవిలో అనారోగ్యము, అదుర్థాపడటం మొదలగునవి. దీర్ఘకాలిక వ్యాధులకు మందులు పనిచేయక ఇబ్బందులు ఎక్కువ అవుతుంటాయి.

శని వలన పైన వివరించిన ఇబ్బందులు తొలగి పేదరికం పోయి స్థితిమంతుడు కావాలంటే, కోరికలు నెరవేరాలంటే శనికి ప్రీతికరమైనవి చెయ్యాలి. అవి చాలా రకాలున్నాయి. అందులో ముఖ్యమైనవి శనికి వచ్చిన రత్నమైన నీలంను ధరించడం. శని ప్రతిమను ఇనుముతో చేయించి లోహపు పాత్రయందు ఉంచి నల్లని వస్త్రాన్నిగాని, నల్లని గొంగళిని గాని పాత్రపై కప్పి నల్లనువ్వులు. నల్లని నువ్వులతో పూజించి, నల్ల బ్రాహ్మణునికి దానం ఇవ్వవలెను. నువ్వుల అన్నం కూడా దానం చేయవచ్చు. నువ్వుల నూనెలో వేయించిన బజ్జీలను కాకులకు వేయవలయును. చెప్పులను, నల్లటి ఆవును, గేదెను దానం చేయవచ్చు.

శని మూల మంత్రం : ఓం శమగ్నిదగ్ని బిస్కరశ్చన్నస్తపతు
సూర్యవంశం వాతో వాత్వరపా అపస్రిద:

ఈ మంత్రాన్ని ప్రతి శనివారం సూర్యోదయాన్నే పఠించిన శని చెడు ప్రభావం నుండి విముక్తి లభింపవచ్చు. శనికి ఇష్టమైన 10 నామాలు ప్రతి ఉదయం చవివినను చాలా ఉత్తమము అని శనైశ్చరా! యమ!కోణ! పింగళ! బభ్రూ, కృష్ణా! రౌద్ర! అంతకా! శౌరి! మంద!

ఇప్పుడు శనికి ప్రీతికరమైన నీలము గురించి సవివరంగా తెలుసుకుందాము. నీలము స్వచ్ఛమైన నీలపు వర్ణముతో గూడి ఎట్టి పరిస్థితులలోను ఇతర రంగులను ప్రసరింపకుండ ఉంటే దృఢమైన రత్నము.

నీలములు వాటి రంగు, స్వచ్ఛతను బట్టి రకరకాలుగా వ్యాజించెందరు. సాధారణంగా బ్రాహ్మణజాతి - స్వచ్ఛమైన నీలిరంగును కలిగియుండును. క్షత్రియ జాతి - లేత నీలిరంగులో ఉండును. వైశ్యజాతి - ముదురు నీలిరంగులో ఉంటుంది. మరియు నీలము నలుపుతో కూడి ఉన్నట్లయితే శూద్రజాతి నీలముగా పరిగణిస్తారు.

నీలములలోను ఇంద్రజీలము, మయూరి నీలం (నెమలి మెడ వర్ణంలో ఉండును). ఇంద్ర నీలం మహాపవిత్రమైనది, విలువైనది. విష్ణుకాంత పుష్పపు వర్ణంలో ఉండే వాటిని నీలమణి అంటారు. లేత నీలివర్ణము గల వాటిని బ్రహ్మ నీలమందురు. ఎరుపు ఛాయలో ఉన్న నీలములను కెంపు నీలమందురు. పసుపువర్ణంలో ఉండే నీలము హరిత నీలమని, నల్లగా కనిపించు నీలమును కాకి నీలమని అందురు. 'స్వచ్ఛమైన నీలమును గరికలో ఉంచినప్పుడు గరికపోచలు నీలమునకు అతుక్కొని పోతాయి. అందువలన వీటిని "తృణగ్రహి" అని కూడా అందురు. పాలలో వేసినప్పుడు నీలము స్వచ్ఛమైనది అయినట్లయితే పాలు నలుపు వర్ణములో మెరయును. గావున "క్షీరగ్రాహి" అని కూడా అందురు.

నీలం చాలా పవిత్రమైనది, చాలా శక్తిగలది, నీలపు వర్ణము చాలా అందమైనది. పంచభూతాలలోని ఆకాశము, సముద్రం (నీరు) నీలము రంగులో ఉన్నవే. ఇవి లభించే ప్రదేశాలు భారత్‌లోని కాశ్మీరం, థాయిలాండ్, రోడిషియా, శ్రీలంక, క్వీన్స్‌లాండ్, ఆస్ట్రేలియా, బర్మా మరియు మయన్మార్‌లలో లభిస్తాయి. శ్రేష్టమైన నీలములు కాశ్మీర్‌లోని సుమ్‌జావ్ అనే ప్రదేశంలో లభిస్తాయి. ఈ స్థలం సముద్రమట్టానికి 14,940 అడుగుల ఎత్తున గలదు.

ఆయుర్వేదంలో నీలపు భస్మాన్ని మూలవ్యాధికి, పక్షవాతమునకు, కుష్టురోగాలకు ఉపయోగిస్తారు. నీలమును గాడిద మూత్రములో 24 గంటలు ఉంచినచో శుద్ధియగును. శుద్ధిచేసిన నీలమును తెలుకొండి ఆకురసములో మూడు రోజులు, ప్రతిరోజు రసము మారుస్తూ నానబెట్టి నూరి ఎండిన తరువాత మూసయందు ఉంచి మట్టితో సీలువేసి కొలిమియందు ఉంచగానే భస్మం అగును.

భౌతికశాస్త్రం ప్రకారము సాంద్రత 4.1-4.6, గట్టితనం క్ష 9 (కెంపు కన్న గట్టిది), రిఫ్రాక్టివ్ ఇండక్స్ (పారదర్శక సూచి) క్ష 1.76-1.77 రసాయనిక సమ్మేళనం చూసినట్లయితే ఇది అల్యూమినియమ్ ఆక్సైడ్‌తో సహా కొద్దిపాటి టైటానియమ్, ఐరన్ మరియు కోబాల్ట్‌లు ఉన్నందున మంచి నీలంరంగులో మెరుస్తూ ఉంటాయి. హెక్సాగోనల్ బై పిరమిడల్ స్ఫటిక నిర్మాణంను సూచిస్తుంది.

రత్నశాస్త్రం ప్రకారం నీలంలోని లోపాలను ఈ విధముగా వివరింపవచ్చు. బీటలు పగుళ్ళు ఉండటం (త్రాప), మసకగా కళావిహీనంగా (భిన్న), మధ్యలో చీలినట్లు ఉండటం (పటల), లోపలి భాగంలో ఇసుక రేణువులున్నట్లు కన్పించడం (పాషాణగర్భము), నీలం లోపల స్పష్టమైన ఎరుపు ఛాయలు కనిపించడం (రక్తబిందు). ఇతర రంగులు కన్పించడం (విచ్ఛాయ), ఉపరితలం నీలంలోను లోపలిభాగం మరొక వర్ణంలో ఉన్నట్లుగా కనిపించడం (కుక్షి), లోపలి భాగంలో నల్లని మచ్చలుండటం (కరంజి), లోపలి భాగంలో చారలు చారలుగా కన్పించడం (వాలుకా స్పర్శ).

మోనో బ్రోమో నాఫ్తాలిన్ ద్రవంలో నీలమును మంచి తెల్లనికాగితంపై ఉంచినప్పుడు స్వచ్ఛం కాని నీలమైతే పేపర్‌పై గీతలు కనిపిస్తాయి.

స్వచ్ఛమైన నీలములో చిన్నచిన్న గాలి బుడగలు లేక నీటిబిందువులు (ఇసుక రేణువుల మాదిరిగా కాక)గా కన్పిస్తాయి.

శరీరమందలి అనాహత చక్రముచే విడుదలగు కాంతి కిరణాలు (కాస్మిక్ కిరణాలు), నీలంచే విడుదలగు కాంతి కిరణాలు భౌతికశాస్త్రం ప్రకారం ఒకే లక్షణాలు కలిగి ఉంటాయని, ఇవి ప్రభావం చూపే శరీర అవయవాలపై శనిగ్రహ ప్రభావము కూడా ఉంటుందని చెప్పుదురు. శనిగ్రహ ప్రభావమో మరే ఇతర ప్రభావమో అనాహిత చక్రం నుండి వచ్చే కిరణాల శక్తి తగ్గి అనారోగ్యం పాలయినప్పుడు నీలము ధరించినప్పుడు ఆ కిరణాలు శక్తివంతమై ఉపశమనం కలుగ చేయును.

ముఖ్యంగ జాతక గోచార విషయాలు తెలియకున్నను అనుభవంలోకి వచ్చు కొన్ని లక్షణాలతో శని ప్రభావం ఉందని చెప్పవచ్చు. అవి క్షయ, క్యాన్సర్, అతి దురలవాట్లు (అతి త్రాగుడు), భార్యాభర్తల మధ్య తీవ్రతగాదాలు, కీళ్ళనొప్పులు మరియు కామెర్లు.

వీటన్నింటి నుండి బయటపడడానికి ఉపయోగించే స్వచ్ఛమైన నీలాన్ని శనివారం రోజు మధ్యాహ్నం 1.00 గం॥ ప్రాంతంలో కొనవలెను. 3 నుండి 5 క్యారెట్లయితే మంచిది. ఉంగరం ఇనుముతో చేసిన ఉంగరంలో పొదగవలెను. కాని ఇనుముతో వీలుపడదు కాబట్టి త్రిధాతు లేక అష్టధాతులతో చేసిన ఉంగరంలో బాణాకారంలో చేసిన గుంటలో శనివారం శనిహోరలో పొదగవలెను. నీలంను ధరింపదల్చినవారు జ్యోతిష్య, సంఖ్యాశాస్త్రాలు మరియు అప్పుడు అమలులో ఉన్న పంచాంగము అన్నియు పరిశీలించి నిర్ణయించవలెను.

మనస్సు దృఢంగా ఉండాలంటే పుష్యమి, అనురాధ మరియు ఉత్తరబాధ్ర నక్షత్ర జాతకులు ధరింపవచ్చు. శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే మకర మరియు కుంభరాశుల వారు ధరింపవచ్చు. శని దశ నడుస్తున్నవారు దశ అనుకూలించకున్నను నీలము ధరింపవచ్చు. ఇవియుగాక జాతకం ప్రకారం మేషలగ్నంలో జన్మించినవారు ధరింపవద్దు. మేషం శనికి నీచరాశి మరియు 10,11 స్థానాలకు అధిపతి. వృషభలగ్నం జాతకులు ధరింపవచ్చు. అధిపతి శుక్రుడు, శని మిత్రులు. మిధునం లగ్నజాతకులు, కన్య లగ్న జాతలకులు, ధనర్‌లగ్న జాతకులు, మీనలగ్న

జాతకులు శని మహాదశ నడుస్తున్నప్పుడు ధరింపవచ్చు. తుల, మరక మరియు కుంభ లగ్నజాతకులు ఎప్పుడైనా ధరింపవచ్చు. మేష, సింహ మరియు వృశ్చిక లగ్న జాతకులు ధరింపకపోవడం మంచిది.

సంఖ్యాశాస్త్రం ప్రకారం 1,10,19,2,8 (రవి సంఖ్యలు), 2,11,20,29 (చంద్ర సంఖ్యలు), 3,12,21,30 (గురు సంఖ్యలు). 4. 13,22,31 (రాహు సంఖ్యలు) మరియు 9,18,27 (కుజ సంఖ్యలు) తేదీలలో జన్మించిన వారు ధరింపకపోవడం మంచిది. లేక ఆలోచించి ధరించవలెను.

జనవరి 15 నుండి మార్చి 14 మధ్య కాలంలో జన్మించినవారు. 8,17,26 తేదీలలో జన్మించినవారును ధరింపవచ్చు. పుష్యమి 5,6,8 తేదీలు, అనురాధ, ఉత్తరాషాడ (2,3 పాదాలు), శ్రవణం, ధనిష్ట శతభిషం, పూర్వాభాద్ర (1,2,3 పాదాలు), ఉత్తరాబాధ్ర నక్షత్రాలతో కూడి 5,6,7,8 తేదీలలో జన్మించిన వారు నీలము ధరింపవచ్చు.

ఉంగరపు వేలికి నీలము ధరింప వద్దు, బంగారం కన్న వెండి మేలు, వెండికన్న మిశ్రదాతు ఉంగరం చాలా మంచిది. మధ్య వేలికి (శని వేలు) ధరింపవలెను.

ధరించు విధానం : నీలం ధరించువారికి తారాబలం చూసుకొని శనివారం రోజున శనిహోరలో (శనివారం ఉదయము 6-7 గంటల మధ్య లేక మధ్యాహ్నం 1-2 గంటల మధ్య) పూజ చేసుకొని ధరింపవలెను. శనివారం ఉదయం అయితేనే ఉత్తమము అని చెప్పవచ్చు. ఆ రోజు ఉదయమే స్నానం చేయునప్పుడు ఆ నీటిని లోహపు (ఇనుప బకీటు అయితే మంచిది) బకెటులో తీసుకొని అందులో మినుములు, కొర్రలు, నీలగంధపు పుష్పాలు వేసి తలంటు స్నాం చేసి పూజకు ఉపక్రమించాలి.

పూజసామాగ్రి : ఐరన్ ప్లేట్, ఇనప దీపం (ఇనపు దీపం కుందు అందులో నల్లనువ్వుల నూనె పోయాలి), నల్ల నువ్వులు, నీలం రంగు పువ్వులు, గంధం, కుంకుమ, ఎనిమిది నలుపు వస్త్రములు (8 జాకెటు ముక్కలయితే మంచిది).

విధానము : ఇనుప ప్లేటుపై నువ్వులు పరిచిదాని ముందు దీపంను వెలిగించవలెను. షాపులో తయారుచేసిన ఉంగరాన్ని షాపులో ధరించి చూడవద్దు. అది తీసుకొని ఇంటికి వచ్చి ధరించే రోజువరకు రోజ్ వాటర్‌లో ముంచి ఉంచవలెను. పూజ మొదలుపెట్టే ముందు ఉంగరంను బయటకు తీసి పాలతో కడిగి గంధం, కుంకుమలతో అలంకరించి నువ్వులలో పెట్టవలెను. (ప్లేటులో పోసిన నువ్వులు). నీలిరంగు పువ్వులతో 108 సార్లు శని మంత్రాన్ని జపిస్తూ పూజను చెయ్యాలి. నువ్వులతో వండిన పులగం (నల్ల నువ్వుల అన్నం)ను ప్రసాదంగ పంచిపెట్టిన తదుపరి 8 మంది భిక్షకులకు ఒక నలుపు వస్త్రం మరియు 10 రూపాయలు చొప్పున దానం చేయవలెను. అన్నీ పూర్తయిన తదుపరి ఉంగరంను దగ్గర దేవాలయాలని తీసుకొనిపోయి ధరించాలి. అయ్యప్ప దేవాలయం అయితే మంచిది.

శని మంత్రం : ఓంకార ధ్వజాయ విధ్మహే<br>
ఖడ్గ హస్తాయ ధీమహీ:<br>
తన్నో మంద ప్రచోదయాత్!!

నీలము ధరించేవారికి కొన్ని సూచనలు

- ఉంగరపు వేలికి ధరించవద్దు.
- ఉంగరంను తయారుచేయగానే ధరించి ప్రయోగించవద్దు.
- ధరించిన మొదటివారం పరిస్థితులు క్షుణ్ణంగ పరిశీలించవలెను.
- ఉంగరం ధరించిన రోజు బ్రహ్మచర్యం పాటించవలెను. ప్రతిరోజు ఉంగరాన్ని దేవుని దగ్గర ఉంచి ఉదయాన్నే స్నానం చేసి ధరించడమూ మంచిది. ఎందుకంటే కొందరి అబిప్రాయం ప్రకారం ఉంగరం చేతికి ఉన్నప్పుడు బ్రహ్మచర్యం పాటించాలి.
- పరస్త్రీపై కోరికలుండరాదు.
- త్రాగుడు, మాంసాహారం ముట్టుకోవద్దు.